విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించిన వారిని అభినందించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేతులు మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న క్రీడాకారులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యతో పాటు క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలని రాజేంద్రనగర్ నియోజక వర్గం ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఈ నెల 18న నిజామాబాద్‌లో నిర్వహించిన జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ హూషు చాంపియన్ షిప్ పోటీలలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రాంతానికి చెందిన ఎ. జయవర్ధన్ 52 కేటగిరిలో బ్రౌంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మహావీర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధి కోసం తన వంతు సహాయ, సహకారాలు ఎప్పుడు ఉంటాయని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించి దేశానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోచ్ సంతోష్ యాదవ్ , బండ రాజేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

డ్రైనేజీలో పేడ... రోడ్లపై మురుగు పరుగు

- డ్రైనేజీలో పేడను వదులుతున్న డెయిరీ ఫాం నిర్వాహకులు
- డ్రైనేజీ పైపులైన్ బ్రేక్ కావడంతో రోడ్లపైకి పొంగిపొర్లుతున్న మురుగు నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ సర్వే నంబర్ 4 మారుతి హోమ్స్ కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా రోడ్డుపై డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో దుర్వాసన, బురదమయంగా మారి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ కాలనీలో నిర్వహిస్తున్న డెయిరీ ఫామ్ నిర్వాహకులు గెదేల పేడను రోజువారీగా దూర ప్రాంతాలకు తరలించకుండా పేడను డ్రైనేజీలో వదలడంతో డ్రైనేజీ పైపులైన్ బ్లాక్ అయి రోడ్డుపై డ్రైనేజీ పొంగిపొర్లుతుందని స్థానికులు వాపోతున్నారు. గతంలో కూడా డెయిరీ నిర్వాహకులు పేడను డ్రైనేజీ పైపులైన్‌లో వదలడంతో ఈ సమస్య తలెత్తిందని జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు డ్రైనేజీ పైపులో పేడ వదులుతున్న నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. డెయిరీ నిర్వాహకులు జీహెచ్ఎంసీ, జలమండలి నిబంధనలను పాటించకుండా డ్రైనేజీ పైపులైన్‌లో పేడను నీటితో కలిపి వదులుతూ ఉండటంతో ఈ సమస్య తలెత్తుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డెయిరీ ఫాం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పంటలు పండించడం కన్నా..
సరైన ధరకు అమ్మడమే కష్టం

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగబడులు : ఏజీవర్సిటీ పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి



సదస్సులో పాల్గొన్న అధికారులు, రైతులు



ఉత్పత్తులను పరిశీలిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పంటలు పండించడం కన్నా సరైన సమయంలో సరైన ధరలకు విక్రయించడమే కష్టంగా మారిందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు పి. రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో అమ్మకందారులు–కొనుగోలుదారుల సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు, రైతు ఉత్పత్తి సంఘాల వారు వీలైనంతవరకు పురుగుమందులు, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధునాతన టెక్నాలజీని వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తుల్ని సరైన సమయంలో సరైన విధంగా మార్కెట్లో అమ్ముకోవడం ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అని అన్నారు. ఇతర పరిశ్రమల్లో అధిక ఉత్పత్తి చేసినప్పుడు బోనస్ లభిస్తుందని కాని వ్యవసాయ రంగంలో ఒక్కోసారి అధిక ఉత్పత్తి కారణంగా నష్టాలు భరించాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పండించిన పంటలను వృథాగా నేలపాలు చేయాల్సి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరగా పాడైపోయే టమాటలు, పూలు, కూరగాయలు వంటి ఉత్పత్తుల మార్కెటింగ్ జటిలమైన సమస్య అని ఆయన న్నారు. భవిష్యత్తులో వ్యవసాయ ఉత్పత్తు సంఘాలు కీలకపాత్ర పోషించనున్నాయని తెలిపారు. ముఖ్యంగా కొనుగోలు దారులు కొనుగోలు చేసే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల్ని ఎక్కడ పండించారు, ఎరువులు పురుగు మందుల్ని ఏ మేరకు వినియోగించారనే అంశాలపై వినియోగదారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రైతులు ఈ విషయాన్ని గమనించాలని వారు సూచించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకులు జి. లక్ష్మీబాయి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల్లో నాణ్యత వైవిధ్యం స్వచ్ఛతలకు ప్రాధానమిస్తే మార్కెట్ చేసుకోవడం సులుపు అవుతుందని వివరించారు. మార్కెటింగ్ శాఖ రైతులకు వీలున్నంత వరకు సేవలు అందిస్తున్నామన్నారు. రైతులు తమ ఉత్పత్తులు శుభ్రం చేయడం గ్రేడింగ్, ఎండబెట్టడం వంటి అంశాల పైన ప్రత్యేక దృష్టి పెడితే మంచి మంచి ధరలు లభిస్తాయని లక్ష్మీబాయి వివరించారు. కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల్ని ఆరు నెలలపాటు తమ శాఖ గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవడానికి కూడా ఒక పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన 10 ఉత్పత్తిదారుల సంఘాల రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు. నాబార్డ్ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ సీమ, వి సుధారాణి, ఐసీఏఆర్ డైరెక్టర్ రామన్ మీనాక్షి సుందరం, విస్తరణ విద్యా సంస్థ సంచాలకులు జగన్‌మోహన్ రెడ్డి, నాబార్డ్ ప్రతినిధి వినయ్‌కుమార్, ప్రాజెక్టు ప్రిన్సిపాల్ మధుబాబు, రైతులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: వివిధ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కాటేదాన్ అసిస్టెంట్ ఇంజినీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11గంటల నుంచి 12:30ల వరకు కింగ్స్ కాలనీ, ఫేస్ 1, 4 నూర్ కాలనీ, రిజ్వాన్ కాలనీ, రుమాన్సి హోటల్ , ఎక్సల్ స్కూల్ ఎడ్జ్, మధ్యాహ్నం 3గంటల నుంచి 4:30 గంటల వరకు శాస్త్రీపురం, రిజ్వాన్ కాలనీ, ఓవైసీ హిల్స్, డైమండ్ హిల్స్, మాముకి హోటల్, నజర్ కన్‌స్ట్రక్షన్ , ఏహెచ్ కన్వెన్షన్, బీకే పురం, క్లాసిక్ గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.

24న భవానీ శివసాయి ఆంజనేయస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ గ్రామం భగవత్‌గూడలోని భవానీ శివసాయి ఆంజనేయస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 24వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 24వ తేదీన ఉదయం 4.30 గంటలకు సుప్రభాతం నాదస్వరం, 5 గంటలకు కలశారాధన, 7 గంటల నుంచి మండల పూజ, రుద్ర హోమం, ఛండీ హోమం, 11 గంటల నుంచి స్వామి వారికి తిరుమంజనం , అలంకారం, సాయంత్రం 6 గంటలకు పుష్పాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఇప్పటికే ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

గండిపేటలో బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయి వార్షికోత్సవ పూజలలో గోపాల గణేష్, గండిపేట ప్రజలు

మణికొండ: గ్రామంలోని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని గత సంవత్సరం బొడ్రాయి ప్రతిష్ఠాపన చేయించామని, దాని ప్రకారం ప్రతి సంవత్సరం వార్షిక పూజలు చేస్తామని మాజీ సర్పంచ్ గోపాల గణేష్ అన్నారు. గండిపేట మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవ పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం నుంచే వేద మంత్రోశ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలను పూజించుకోవటం ఆనవాయితీ వస్తుందన్నారు. అనంతరం గ్రామస్తులు పెద్దఎత్తున సాకలు పెట్టి మొక్కులను చెల్లించుకున్నారు.

యువత సేవా భావాన్ని అలవర్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖురేషి

గోల్కొండ: యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ సలహాదారు ఖురేషి అన్నారు. టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో గోల్కొండ యూత్ అసోసియేషన్ సభ్యులతో మంగళవారం ఆయన మాట్లాడారు. కుటుంబ తగాదాల పరిష్కారమే కాకుండా భార్యభర్తలు కలహాలతో విడిపోకుండా వారికి కౌన్సెలింగ్ నిర్వహించడమే ప్రధాన టాస్క్ అని అన్నారు. కొవిడ్ కష్టకాలంలో తమ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆధ్వర్యంలో ఉపాధి కోల్పోయిన నిరుపేదలకు అండగా నిలిచామన్నారు. ఆపత్కాల సమయంలో యువత మేమున్నామంటూ ముందుకు వచ్చి సేవా కార్యక్రమాల్లో తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహ్మద్ నజీబ్, ఖాలేద్‌ఆలీఖాన్, వాజీద్ తదితరులు ఉన్నారు.

గోల్కొండ కోట చౌరస్తా వద్ద ట్రా'ఫికర్'



గోల్కొండ: గోల్కొండ కోట చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ కావటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోటను చూసేందుకు నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. వీరితో పాటు రాందేవ్‌గూడ నుంచి గోల్కొండ కోట చౌరస్తా మీదుగా షేక్‌పేట్ చౌరస్తా వెళ్లే వారు, లంగర్‌హౌజ్ నుంచి సైతం ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు కోట చౌరస్తా మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు గోల్కొండ చౌరస్తాలో పర్యాట కులు నానా అవస్థలు పడుతున్నారు. కోట ఫెన్సింగ్‌ను ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును కూడా పలువురు తోపుడుబండ్ల వారు ఆక్రమించారు. అంతేకాకుండా కోట మెయిన్ గేటు ఇరువైపులా వివిధ రకాల వ్యాపారాలు కూడా రోడ్డుపైనే సాగుతుంటాయి. దీంతో కోట చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ నివారించాలంటే ఫుట్‌పాత్ ఆక్రమణలు తప్పనిసరిగా తొలగించాలని, ఆటోలను కోట చౌరస్తా వద్ద కాకుండా రాందేవ్‌గూడ రోడ్డు వైపు ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మనూలో సోషియాలజీలో పోస్టు గాడ్యుయేషన్, పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తుకు గడువు జూన్ 30 అని 'మనూ' సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ కెఎం జియావుద్దీన్ మంగళవారం తెలిపారు. ఎంఏ సోషియాలజీకి మెరిట్ ప్రాతిపదికన 25 సీట్లతో ప్రవేశ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. పీహెచ్‌డీ కోర్సుకు అడ్మిషన్ ప్రవేశ పరీక్ష ప్రాతిపదికన ఉంటుందన్నారు. దీనికోసం మే 30 ఆఖరు అని తెలిపారు. ప్రవేశ పరీక్షను జూన్ 12వ తేదీన నిర్వహించడుతుందన్నారు. ఈ ఏడాది పీహెచ్‌డీ కోర్సు కోసం 15 సీట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఉర్దూ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలన్నారు. దరఖాస్తులు, ప్రాస్పెక్టస్‌లు యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం డాక్టర్ ఎహ్తిషామ్‌అక్తర్ (9811718473), డాక్టర్ హిలాల్ అహ్మద్‌వార్ (8341503410) ఫైసల్ అజీజ్ (9682619915), ఆసిమ్ సొహైల్ (9730407510)లో సంప్రదించాలన్నారు.

'మనూ'లో సంతాప సభ

రాయదుర్గం: హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందిన ఇరాన్ అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీమ్ రైసీకి మనూలో మంగళవారం నివాళులు అర్పించారు. 'మనూ'లోని పర్షియన్ డిపార్ట్‌మెంట్ అండ్ సెంట్రల్ ఏషియన్ స్టడీస్ (డీపీ అండ్ సీఏఎస్)ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ ఇరాన్ అధ్యక్షుడు రైసీ ఆధ్వర్యంలో భారత్–ఇరాన్ దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగాయని అన్నారు.

ఓపెన్ జిమ్ సామగ్రి మాయం



కోకాపేటలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్



జిమ్‌లో మాయమైన సామగ్రి

అధికారుల నిర్లక్ష్యం వల్లేనని స్థానికుల మండిపాటు

మణికొండ: అధికారులు ప్రజల ఆరోగ్య సంరక్షణకు దోహదపడే విధంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లోని సామగ్రిని దొంగలు అపహరించుకొనిపోయారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట చెరువు వద్ద ఉదయం, సాయంత్రం సమయంలో వాకింగ్‌కు వచ్చే వారు కొద్ది సేపు ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసుకుంటారనే ఉద్దేశంతో రూ.3.50లక్షలతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు. అయితే ఈ జిమ్ గ్రామానికి దూరంగా ఉండటంతో ఎక్కువ మంది అటు వైపు వెళ్లడం లేదు. దీంతో అవి సంవత్సరాల తరబడి నిరుపయోగంగా పడి ఉన్నాయి. అదే అదనుగా కొందరు సామగ్రిని చోరీ చేసి తీసుకుని వెళ్లారు. దాంతో అక్కడ ఓపెన్‌జిమ్ ఆనవాళ్లు లేకుండా పోయాయని స్థానికులు వాపోతున్నారు. గతంలో నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, గండిపేట, నార్సింగిలలో పలు చోట్ల ఇలాగే ప్రజలకు సౌకర్యంగా లేని చోట వాటిని ఏర్పాటు చేసి లక్షలాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశారని ఆయా వార్డుల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు ప్రజలకు సౌకర్యవంతంగా ఉన్న చోట్ల ఇలాంటివి ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణ సవాళ్లను అధిగమించాలి

ఈడబ్ల్యూబీజీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మైక్‌చాన్



ట్రిపుల్ ఐటీ ఫ్యాకల్టీ, విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న మైక్‌చాన్

రాయదుర్గం: భారతదేశ ఆరోగ్య సంరక్షణ సవాళ్లను మరింత ప్రభావవంతంగా అధిగమించాల్సిన అవసరముందని యూరోపియన్ వెల్‌నెస్ బయోమెడికల్ గ్రూప్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మైక్‌చాన్ అన్నారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, ప్రత్యేక దృష్టి పెట్టడం, సహకారం పెంపొందించేందుకు ఈడబ్ల్యూబీజీ కృషి చేస్తుందన్నారు. సమర్థవంతంగా ఆరోగ్య సమస్యలు పరిష్కరించేందుకు ఆధునాతన చికిత్స, అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. స్టెమ్ సెల్ థెరపీ విధానం గురించి విద్యార్థులకు వివరించారు.యూరోపియన్ వెల్‌నెస్ భారత్ సీఈఓ డాక్టర్ రవితేజ్ అల్లం నూతన ఆవిష్కరణల ప్రాధాన్యతలను వివరించారు. మా వినూత్నమైన ఆవిష్కరణలను భారత్‌కు తీసుకరావడం సంతోషంగా ఉందన్నారు.

ఈడబ్ల్యూబీజీ బృందం సందడి

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో యూరోపియన్ వెల్‌నెస్ బయోమెడికల్ గ్రూప్ (ఈడబ్ల్యూబీజీ) బృందం సందడి చేసింది. మంగళవారం గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌ను ఈ బృందం సందర్శించింది.

చెట్లను నరికేసిన వారిపై చర్యలు తీసుకోండి

మణికొండ: కాలనీలో రోడ్డు, పార్కు స్థలం పక్కన, రోడ్డు నెంబర్ 7లో ఉన్న చెట్లను నరికేసిన వ్యక్తిపై మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని తిరుమలహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.కాంతారావు ఫిర్యాదు చేశారు. మణికొండ మున్సిపాలిటీ, తిరుమలహిల్స్ కాలనీలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచటంతో పాటు పచ్చదనం, నీడను ఇచ్చేందుకు గతంలో గ్రామపంచాయతీ తరఫున మొక్కలు నాటారన్నారు. అవి పెరిగి పెద్దది అయి మంచి గాలి, నీడ ఇస్తున్న తరుణంలో ఓ వ్యక్తి వాటిని ఎవరికీ చెప్పకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా కొట్టి వేశారన్నారు. అతనిపై మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు.

సిటిజన్స్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

శేరిలింగంపల్లి: నల్లగండ్ల సిటిజన్స్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ క్యాన్సర్ సంరక్షణలో విప్లవాత్మక పురోగతిని సాధించిందని ఆస్పత్రి రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వినీత రెడ్డి మంగళవారం తెలిపారు. కార్సినోమా అనోరెక్టమ్‌తో బాధపడుతున్న 58 ఏళ్ల మహిళకు విజయవంతంగా చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. మల్టీ డిసిప్లినరీ విధానం అత్యాధునిక సాంకేతికతతో ఏఓఐలోని రేడియేషన్ బృందం రోగి యొక్క అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన సంరక్షణను అందించిందన్నారు. అధునాతన పద్ధతులను ఉపయోగించి కణితి చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణజాలానికి హాని కలగకుండా తగ్గించగలిగామన్నారు. ఏఓఐ రీజనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ పి ప్రభాకర్ పాల్గొన్నారు.

యువతకు హెచ్‌సీఏ ప్రోత్సాహం



సుఫియాన్‌ను అభినందిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

గోల్కొండ: క్రికెట్‌పై ఆసక్తి ఉన్న టీనేజీ పిల్లలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రోత్సహిస్తుందని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు అన్నారు. నిజామబాద్‌కు చెందిన మహ్మద్ సుఫియాన్ హెచ్‌సీఏ నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిబిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం హెచ్‌సీఏ అధ్యక్షుడిని కలిశారు. నిజామబాద్ జిల్లాలో జరిగిన క్రికెట్ పోటీల్లో సోఫియాన్ అత్యంత వేగంగా బంతులు విసురుతూ ఫాస్ట్ బౌలర్‌గా ఎదుగుతున్నాడన్న విషయం తనకు తెలిసిందన్నారు. మంచి కోచ్ వద్ద శిక్షణ పొంది అత్యుత్తమ క్రికెటర్‌గా ఎదగాలని ఆయన సోఫియాన్‌కు సూచించారు.

25న జీఎన్ఐటీఎస్ గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: ఈ నెల 25వ తేదీన గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నట్లు షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్ ప్రొఫెసర్ సున్నైనాసింగ్ ముఖ్య అతిథిగా, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. 2020–2024 బ్యాచ్‌కు చెందిన బీటెక్, ఎంటెక్ అభ్యర్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నట్లు ఆమె తెలిపారు.

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గోల్కొండ రిసాలాబజార్‌లోని మదర్సా రహమత్ ఉల్‌ఉలూమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్‌ఆలీషా ఖాద్రీ సూచించారు. మదర్సాలో పదేళ్లలోపు విద్యార్థులకు ప్రత్యేక సెక్షన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్సాకు వచ్చే విద్యార్థులు క్రమ శిక్షణ అలవర్చుకుంటారని అన్నారు.

నవ భారత సృష్టికర్త రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కోరని దయానంద్



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీకి నివాళులర్పించిన నేతలు



రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మహిళా నాయకురాలు

రాజేంద్రనగర్: బడుగు, బలహీన వర్గాల నాయకుడు, నవ భారత నిర్మాణ సృష్టికర్త దేశానికి దిశానిర్దేశం చూపిన మార్గదర్శకుడు రాజీవ్‌గాంధీ అని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్ (డేవిడ్) అన్నారు. పేదల పెన్నిధి దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధి బుద్వేల్ టీచర్స్ కాలనీ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరని దయానంద్ హాజరై ఆయన రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్‌గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనన్నారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలి కమ్యూనికేషన్లను దేశానికి పరిచయం చేశారన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో అనేక విప్లవాత్మక సంస్కరణలతో దేశాన్ని ప్రగతిపథంలో ముందుకు నడిపించారన్నారు. దేశంలో సమ సమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేమని కొనియాడారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు వెనుకబడిన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కోరని ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

అత్తాపూర్: రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు సదాలక్ష్మీ అన్నారు. దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతోన్మాద బిజెపిని ఓడించి తీరాలన్నదే లక్ష్యంగా యావత్ దేశ ప్రజలు అదే పనిగా పనిచేస్తూ యువ నాయకుడు రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడాలన్న కాంక్ష దేశ ప్రజల్లో బలంగా ఉందన్నారు. రాజీవ్‌గాంధీ దేశ ప్రజలకు సేవలను ఆదర్శంగా తీసుకొని రాహుల్ గాంధీ ఆయన బాటలో నడుస్తున్నారన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను మనందరం కలిసి కట్టుగా పనిచేసి ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు.

శంషాబాద్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ మహిళా నాయకురాలు మైలారం సులోచన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత దేశాన్ని పరుగులు పెట్టించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్, నాయకులు జి.బి శ్రీధర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గాంధీకి వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కాలనీ వాసులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదిత్యనగర్‌లో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, మంచినీటి సమస్య, అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల పనులు, విద్యుత్ సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, నాయకులు ఖాసీం, లియాఖత్ అలీ, ఇమ్రాన్, మహమ్మద్ అమీర్, మొహినుద్దీన్ పాల్గొన్నారు.

పాన్‌షాప్ నిర్వాహకుడికి జైలు

విజయనగర్‌కాలనీ: పాన్‌షాప్ నిర్వాహకుడికి 5 రోజుల జైలు శిక్ష పడింది. ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయం సమీపంలో మహ్మద్ మజర్ పాషా (21) పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి అయినప్పటికీ పాన్ షాపు నిర్వహిస్తుండడంతో ఎస్ఐ శ్రీనివాస్ తేజ మజర్‌పాషాను అదుపులోకి తీసుకుని నాంపల్లి నాలుగో స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి డీసీ ఉమాపతిరావు నిందితుడికి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.